క్లుప్తంగా

కాలువ పూడిక తీతకు మోక్షం


గంగనాపల్లి మురుగుకాల్వలో సాగుతున్న పూడిక తీత పనులు

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి గ్రామంలో మురుగు కాల్వ పూడిక సమస్యకు మోక్షం లభించింది. ఇటీవల తుపాను ప్రభావంతో గంగనాపల్లి గ్రామంలో కురిసిన వర్షాలకు పలు చోట్ల మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మరో వైపు కొవ్వాడ, తదితర గ్రామాల నుంచి నీరు చేరుతుండడంతో మురుగు సమస్య పెరిగిపోయింది. సత్యదేవ గార్డెన్ ప్రాంతంలో మురుగు కాల్వలో పూడిక తీత పనులను శనివారం సర్పంచ్ గీసాల మహాలక్ష్మి పర్యవేక్షణలో చేపట్టారు. గ్రామ నాయకుడు, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు తదితరులు జేసీబీతో పూడిక తీయించారు.

నిత్యావసర సరకులు పంపిణీ


నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి, సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు కోరమాండల్ మహిళాక్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం ప్రాణాంతక వ్యాధిగస్తులకు నిత్యాసవర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు తమ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సహకరిస్తున్నారన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శిరీష మాట్లాడుతూ సమాజ సేవను సామాజిక బాధ్యతగా చేపట్టి నిస్సహాయకులకు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, లక్ష్మీ సృజన, విజయలక్ష్మి, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాంగ్రెస్ భ్రష్టు పట్టిస్తోంది


నాగమల్లితోట సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

కాకినాడ రూరల్: నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వికసిత భారతదేశంగా రూపాంతరం చెందుతోందని, కానీ పలువురు కాంగ్రెస్ నేతలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరు రామకుమార్ అన్నారు. నియోజకవర్గం నాగమల్లితోట సెంటర్లో ఆ పార్టీ శ్రేణులు ఈ మేరకు ధర్నా చేశారు. రెండు రోజుల క్రితం జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ రాహు, ధీరజ్ సాహు ఇంట్లో జరిగిన ఐటీ దాడుల్లో రూ.200 కోట్లు నల్లధనం బయటపడి దేశాన్ని కుదిపేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పితాని లీలావతి, నందూరి సత్తిబాబు, గౌతు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు .

నేడు జాతీయ స్థాయి కరాటే పోటీలు


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెండో జాతీయ స్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ డి.శంకరరావు తెలిపారు. శనివారం టోర్నమెంట్‌కు సంబంధించిన ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 10 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు, కరాటే కోచ్‌లు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకూ పోటీలు జరుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెల్లూరు సూర్యనారాయణ, జిల్లా మొదటి గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, రెండో గవర్నర్ వి.కోటేశ్వరరావు, మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పాల్గొని బహుమతులు అందజేస్తారని తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి, కరాటే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు బి.రామారావు, ఎం.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



పేపకాయలపాలెంలో మడిలో మోకాలు లోతు నీటి నుంచి ధాన్యాన్ని ఒడ్డుకు తెస్తున్న అన్నదాతలు, తడిసిన ధాన్యాన్ని రహదారిపై ఆరబెడుతున్న రైతులు


కొరుపల్లిలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరమణి, తహసీల్దార్ శ్రీనివాసరావు

అన్నదాతకు అభయమిస్తూ..

- అంచనాలు సర్వే చేసేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఆన్‌లైన్‌లో నష్టపోయిన రైతుల వివరాలు

కరప: మిచాంగ్ తుపానుతో మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా కరప, పేపకాయలపాలెం, కొరిపల్లి, వలసపాకల, వాకాడ, యండమూరు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో సార్వా పంటకు నష్టం వాటిల్లింది. సుమారుగా 786 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ పలు గ్రామాల్లో వరికుప్పలు, పనలు, ధాన్యం రాశులు పంటపొలాల్లో ముంపు నీటిలోనే ఉన్నాయి. నీటమునిగిన వరిపనలు, పడిపోయిన చేలు పూర్తిగా కుళ్లిపోవడంతో రైతులు నష్టపోయారు. వరికుప్పలు నానిపోయి దెబ్బతిన్నాయి. లే అవుట్లలో, రోడ్డు మార్జిన్లలో వేసిన ధాన్యం రాశుల అడుగుకు వర్షం నీరు చేరడంతో ధాన్యం మొలకలు వచ్చి, ఎందుకు పనియేయకుండా పోయాయి. ఎక్కడెక్కడ ఏమేర నష్టం వాటిల్లిందీ సర్వేలో తేలనుంది.

అధికారుల పరిశీలన

మండలం కొరిపల్లి, కరప గ్రామాల్లో శనివారం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పి.మాచర్రావు పర్యటించి తడిసినపోయిన ధాన్యం రాశులు, మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని వారు వివరించారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

వరద ఉధృతితో ముంపునకు గురైన పంటలను గుర్తించేందుకు ఉన్నతస్థాయి అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ బృందంలో గ్రామ రెవెన్యూ అధికారి, రెవెన్యూ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు ఉంటారు. ఆయా గ్రామాల్లో జరిగే పంట నష్టాన్ని అంచనావేసి ఆన్‌లైన్ చేస్తారు.


కరపలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న అన్నదాతలు

అధికారులకు అందించాల్సిన పత్రాలు

పంట నష్టపోయిన రైతులు అధికారులకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఎకౌంట్ జెరాక్స్‌లు, కౌలు రైతులకు ప్రభుత్వం అందించిన కౌలు కార్డులతో పాటు ఆధార్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లను అందజేయాలి.

పూర్తిస్థాయిలో సర్వే



ముంపునకు గురై నష్టపోయిన వరి పొలాలను పూర్తి స్థాయిలో సర్వే చేస్తాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ముంపు ప్రాంతాలకు వెళ్లి పంటలను పరిశీలిస్తున్నాం. నష్టపోయిన ప్రతి రైతు, కౌలురైతు వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. దీనిపై రైతులు అధికారులకు సహకరించాలి.

– ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప మండలం

ధాన్యం కొనుగోలుకు చర్యలు

- 11 నుంచి పంటనష్టం నమోదు
- ప్రతీ రైతును ఆదుకుంటాం
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


పెద్దాపురప్పాడులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: తుపాను వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రైతులకు భరోసా ఇచ్చారు. మండలం పెద్దాపురప్పాడులో శనివారం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి పర్యటించి

కళ్లాల్లో, లేఅవుట్లలో, రోడ్డు మార్జిన్లలో ఉన్న ధాన్యం రాశులు, ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంటలు నష్టపోయామని, ధాన్యంలో తేమశాతం పేరుతో తక్కువ రేటుకు అడుగుతున్నారని, నిబంధనలు సడలించి, ధాన్యం కొనుగోలు చేయించాలని రైతులు కోరగా ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. పంట నష్టాన్ని, ధాన్యం పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, సివిల్ సప్లైస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, ధాన్యం కొనుగోలుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్రంగా పరిశీలించి, పంటనష్టం నమోదుకు చర్యలు తీసుకుంటామని, రైతులు అధైర్యపడవద్దన్నారు. 11వ తేదీ నుంచి వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పొలాలను పరిశీలించి పంటనష్టం నమోదుచేయడం జరుగుతుందన్నారు. రైతులు తమకుజరిగిన నష్టాన్ని వివరించి, పేర్లు, విస్తీర్ణం వివరించి, నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నష్టపోయిన మొత్తాన్ని నమోదయ్యేలా చూడాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావును ఆదేశించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, నల్లా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డిపో మేనేజర్

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్ యువర్ డిపో మేనేజర్ నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శనివారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 99592 25534 నంబర్‌కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చెప్పవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్‌కు నేడు ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నారు. సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు శనివారం మాట్లాడుతూ అండర్–14, 16 బాలురు, బాలికల విభాగంలో జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో క్రాస్‌కంట్రీ పోటీలకు ఉదయం 7 గంటలకు క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

17న వైఎంసీఏ ఆధ్వర్యంలో పాటలు, క్విజ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శాఖ అధ్యక్షుడు హెన్రీ, కార్యదర్శి గాంధీ శనివారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. 30 ఏళ్ల లోపు వారు ఈ పోటీకి అర్హులన్నారు. పాటల పోటీలు వ్యక్తిగత, గ్రూప్ విభాగంలో జరుగుతాయన్నారు. విజేతలకు ఈ నెల 28న సిటీ టేబర్నికల్ చర్చిలో జరిగే వైఎంసీఏ క్రిస్మస్ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 95358 68625, 98484 03492 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఐబ్యాంక్ వార్షికోత్సవం

బాలాజీచెరువు: బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఐబ్యాంక్‌లో నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు బాదం బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా కాకినాడ సీపోర్టు సీఈఓ మెర్ల మురళీధర్, లయన్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ హాజరవుతారన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,884 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌ను పరిశీలిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ కమలాదేవి

కాకినాడ లీగల్: జాతీయలోక్ అదాలత్ ద్వారా 1,884 కేసులు పరిష్కారమయ్యాయని మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టుల్లో శనివారం 11 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 1,884 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్ బెంచ్‌లకు న్యాయమూర్తులుగా నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్.వి.నిఖిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎస్ పద్మజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.లీలా శ్యామ్ సుందరి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.సాహితి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి, నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరూప బాంజ్ డియో, ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మికుమారి, స్పెషల్ ఎక్సై జ్ అండ్ ప్రొహిబిషన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఎస్పీ సతీష్‌కుమార్


అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ సిటీ: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అన్ని విధాలా సహకరిస్తామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం సభ్యులతో సమావేశమైన ఆయన వారి కుటుంబాల సంక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలసి చెప్పవచ్చని అన్నారు. ఆరోగ్య పరంగా శ్రద్ధ తీసుకోవాలని ఆయన వారికి సూచించారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఆవుల సుబ్బారావు, సనపన సూర్యారావుల ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో ఎస్పీ మాట్లాడారు.



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇటీవల కాకినాడలో కురిసిన వర్షానికి జిల్లా క్రీడామైదానం చెరువులా మారింది. క్రీడా మైదానం లోతట్టు ప్రాంతం కావడంతో మోకాలు లోతు నీరు చేరి ఆడుకోవడానికి వీలు లేకుండా ఉండడంపై క్రీడాకారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌బాల్ మైదానం ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌ను కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి దీపాలు


కరప విష్ణాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కరప: మండల పరిధిలోని కరప, జెడ్.భావారం, కూరాడ, పెనుగుదురు, యండమూరు తదితర గ్రామాల్లోని విష్ణు, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం కార్తిక బహుళద్వాదశి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కార్తికదీపాలు వెలిగించి, స్వామివార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన సాంబత్తుల వెంకట్రావు కుమార్తెలు పావని, శ్రావణి రూ.20 వేల విలువైన 20 కుర్చీలు, రెండు భోజనం టేబుళ్లను ఆలయానికి విరాళంగా అందజేశారు.


యండమూరు వెంకన్న ఆలయంలో దీపారాధన

భీమేశ్వరుని దయతో మరింత సేవ

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా
- పంచారామ క్షేత్రం సందర్శన


మంత్రి రోజాను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు, ఆలయ పండితులు, అధికారులు

సామర్లకోట: పంచారామ క్షేత్రాల దర్శనంలో భాగంగా రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కే రోజా శనివారం స్థానిక క్షేత్రంలోని కుమారా రామ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల పూజల అనంతరం పండితులు రోజాకు వేదాశీర్వచనం చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆమెను అమ్మవారి ఫొటో అందజేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు. ఏటా స్వామివారిని దర్శించుకుంటానని, స్వామి ఆశీస్సులు ఉంటే ఎంత దూరమైనా వెళ్లి ప్రజా సేవ చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తామంతా సేవ చేసేలా ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నాని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అహం వీడితే అమ్మ అనుగ్రహం

- పరిపూర్ణానంద స్వామీజీ
- 26వ రోజుకు చేరుకున్న మహాశక్తి యాగం
- 94 కోట్ల లలితా కుంకుమార్చనలు పూర్తి
- నేడు శతకోటి కుంకుమార్చనల ఘట్టం
- పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు కుటుంబ సభ్యులు
- అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస కల్యాణానికి వేలాదిగా హాజరైన భక్తులు

కాకినాడ రూరల్: సర్వం శివోహమని, పుట్టుక, జీవం, మరణం ఇవన్నీ శివపరమాత్ముడివేనని ప్రతి మనిషి తన జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు అహం వీడాలని, తద్వారా అమ్మ అనుగ్రహం కలుగుతుందని పరిపూర్ణానంద స్వామి శనివారం దివ్య అనుగ్రహ భాషణం చేశారు. శ్రీపీఠం వేదికగా రమణయ్యపేటలో శతకోటి కుంకుమార్చనల మహాశక్తి యాగం ఘనంగా జరుగుతోంది. వేలాదిగా తరలివస్తున్న మాతృమూర్తులు, భక్తుల నడుమ స్వామీజీ లలితా సహస్రనామ అర్చనలతో కుంకుమపూజలు చేయిస్తున్నారు. 26వ రోజుతో 94 కోట్ల కుంకుమార్చనలు పూర్తయ్యాయి. ఆదివారం శతకోటి కుంకుమార్చనల మైలు రాయిని పూర్తిచేసే మహాఘట్టం ఆవిష్కృతమవుతుందని ఆయన వెల్లడించారు. యాగంలో భాగంగా 91 లక్షల బగళాముఖి జపాలు పూర్తయ్యాయన్నారు. అతిరుద్రం, కోటి దీపోత్సవాలు ఇప్పటికే లక్ష్యానికి చేరువయ్యాయన్నారు. మంగళవారం ఆంజనేయస్వామికి లక్ష అరటిపండ్లతో అభిషేకం చేస్తామని, పాడ్యమి రోజు బుధవారం భక్తులు స్వయంగా తయారు చేసి తీసుకువచ్చే లక్ష బూరెలతో పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. నభూతో నభవిష్యతి అన్నట్టు మహాశక్తి యాగాన్ని మహిళామూర్తులే విజయవంతం చేస్తున్నారన్నారు. ఉదయం హైదరాబాద్‌కు చెందిన అభిరామ్ సంగీత కచేరితో ఆకట్టుకోగా, రాధా మనోహర దాసు ఆధ్యాత్మిక సందేశాన్ని ఇచ్చారు. సాయంత్రం జనార్దన బృందం సంగీత కచేరితో ఆకట్టుకుంది. కుంకుమార్చనల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, సోదరుడు కల్యాణ్, కుమార్తె సిరి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొని, అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సాయంత్రం కోటి దీపోత్సవం అనంతరం మహాశక్తి యాగం వేదికపై శ్రీనివాస కల్యాణాన్ని తిరుమలలో మాదిరిగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపీఠం ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు వెంకటేశ్వరస్వామిగా దర్శనమిచ్చారు.


భక్తులకు హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ


కుంకుమపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన శాల ద్వారా స్వామివారికి రూ.5.11 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో దాతలకు స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు కుంచే బుచ్చిరాజు పాల్గొన్నారు.